# సినీ బేతాళ కథలు

## - డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 37 -

### - *'ఇంద ఇంద తీసుకో!'* -

**విక్రమార్కుడు,** బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని మళ్లీ నడకసాగించాడు.

"విక్రా! నా కథలు వినివినీ నీకో చెవి రాలిపోయింది. కొత్త చెవి తగిలించుకున్నావ్. అంచేత నీకు హ్యాపీ న్యూ యియర్! ఇప్పుడు నీకు చెవిచిత్ర కథ చెబుతాను, విను" అని బేతాళుడు కథ మొదలుపెట్టాడు.

'- నీకు తెలుసుగా! ప్రతి యేటా వుత్తమ తెలుగు చిత్రానికి, వుత్తమ నటీనటులకి, టెక్నీషియన్లకి రకరకాల సంస్థలు తమ నిర్ణయాలకు తోచిన అవార్డ్స్ యిస్తున్నారు. ఇవాళ 'ఇందా' ఎవార్డ్స్ గురించి చెప్తా. ఇంకా 'ఏందీ' అవార్డ్స్ 'ఉందా' అవార్డ్స్ వగైరా సంస్థలు వున్నాయనుకో. కానీ యీ 'ఇందా' ఎవార్డ్స్‌కి పాపులారిటీ గిరాకీ యెక్కువ.

ఈసారి 'ఇందా' అవార్డ్స్ కమిటీ సభ్యులంతా కలిసి ఏ ఎవార్డు ఎవరికిద్దామో నిర్ణయించేందుకు, గత యేడాది రిలీజైన తెలుగు సినిమాలన్నీ ఓ థియేటర్లో పోగేసుకుని వోపిగ్గా చూశారు. చూశాక కమిటీలో యిద్దరికి తలనొప్పితో తలలు పగిలి హెడ్ యింజరీలతో 'దా!దా!' కార్పొరేషన్ హాస్పిటల్లో ఎడ్మిట్ అయ్యారు. ఎందుకంటే చూసిన సినిమాల్లో నలుగురూ చూసే సినిమాలకన్నా, నలుగురే చూసే సినిమాలే లెక్కకుమించి వున్నాయి. ఎవార్డ్స్ యెలా యివ్వాలో, యెవరెవరికి యివ్వాలో యెవరికీ తోచలేదు.

'అందరికీ ఫారిన్ మోజే కదా - ఆస్కార్స్‌ని ఫాలో అవుదామా? ' - అన్నారో మెంబరు.

'అంటే ఎలా? ' - అడిగారు మిగతా కమిటీ.

ఏవుందీ - ఆస్కారువారు వొక యేడాది తెల్ల నటులకి, మరో ఏడాది నల్ల గుంపుకీ, యింకో యేడాది ఏషియన్ మూకకీ యిచ్చినట్టే - యిక్కడ తలో వర్గానికీ తలో యేటా యిస్తే అన్ని రకాల అభిమాన వర్గాలు ఆనందిస్తాయి. అంతా ఆనందిస్తే అంతా మన 'యిందా'నే అందలం యెక్కిస్తారు. 'యిందా' నిర్ణయాలకు ఫలితంగా మన ప్రభుత్వం కూడా బట్ట కడుతుంది - అని వివరించారు ఆ మెంబరుగారు. ఇదీ బాగానే వుంది అని తమకు తోచిన ఎవార్డ్స్ ఎవరెవరికివ్వాలో తాత్కాలికంగా అనుకున్నారు. అనుకోగానే యీ సంగతి మీడియా వారికి లీకైంది. వెంటనే తెరమీది వారికీ, తెరచూసేవారికీ విషయం తెలిసి రకరకాల వాగ్వివాదాలతో మీడియాకి సోకిన లీకు

'యిందా' వారికి మేకైంది. అందర్నీ సంతృప్తి పరిచే అన్యమార్గం అన్వేషించారు 'యిందా' ఎవార్డ్ కమిటీ సభ్యులు. వారికి సలహాల పులిగా సక్సెస్ అయిన శాస్త్రీ వొకాయన సోమాజిగూడాలో ఓ కొత్త నిర్మాతకు 'సినిమా యెలా తీసినా ఆడుతుందో ఓడుతుందో చెప్పలేం - కానీ ఎవార్డు యిస్తారో యివ్వరో ముందే లీకవుద్ది' - అని సలహా యిస్తూ కనిపించాడు.

'యిందా' మంద, సలహాల పులి దగ్గర మోకరిల్లారు.

'ఎవరుబాబూ మీరు?' అనడిగాడు పులి.

'అయ్యా! మేం 'యిందా'లో యిరుక్కున్న కవిటీ మెంబర్లోళ్లవండి.'- అని వినయంగా బదులిచ్చారు.

'ఏం కావాలి బాబూ మీకు?' - అడిగాడు సలహాల పులి.

'అయ్యా పులిరాజా! 'యిందా' ఎవార్డ్స్ వొకరికిస్తే వొకరికి కోపం. ఎవరికిస్తే అంతా న్యాయం అనుకుంటారో సెలవియ్యండి.'

'ఎవరికో వొకరికిచ్చుకోండి మీ తొక్కలో అవార్డ్స్'

'అదేంటిసార్ అలా అన్నారు.'

'అవును. మీ యిష్టం వొచ్చినాల్లకియ్యండి. ఎవడేం పీకలేడు.'

'పీకకపోయినా యేకుతారుగదండీ!'

'యేకితే యేకించుకోండి. పీకితే పీకిచ్చుకోండి. అలాగే సెట్టయిపోండి - మీరు ఫిక్సయిపోతే సెట్టవక తప్పదు'

'ఆహా - మీ మాటలు అవార్డు చిత్రాల డైలాగ్స్‌లా వున్నాయి. పులిరాజా!'

'అదేమరి - మాటలు సక్కగా సెప్పాలో లేక సక్కటి మాటలు సెప్పాలో తెలిత్తే అవార్డు సినిమా డైలాగులు నాకెందుకు?'

'మరింతకీ ఏం సైమంటారు - పంచిపులిరాజా?'

'గాండ్రు!'

'అదేంటిసార్ - గాండ్రుమంటున్నారు.'

'నేను పులినికదా! పులయితే గాండ్రుమనాలికదా! అందుకే గాండ్రుమన్నాను. ముందీ యిసయం తెలుసుకోండి - పులిగాండ్రుమంటుంది, సింహం గర్జిస్తుంది. ఏనుగు ఘీంకరిస్తుంది. గాడిద ఓండ్రపెడుతుంది. కుక్క మొరుగుతుంది. అలాగే మీ 'యిందా' బుందం మా యిట్టం అనాల.'

'సరేసర్ - మా యిష్టం - మా యిష్టం. తొక్కలోది. పీకలేరు.' అని డ్యాన్సు చేసారు.

సలహాల పులి అన్నాడు - 'ముందా గంతులాపండి. యిక్కడోసిన్నయిసయం వుంది. '

'ఏంటి సార్?'

'ఎవార్డ్స్ మీకు తోసినట్టు పంచినా - అంతా మెచ్చాలంటే ఓ సిన్న ఉపాయం వుంది. అదేటంటే సినిమా సూసేదెవడు? - పేచ్చకుడు. అంచాత పెద్దోడనుకుని ఎవడో ఎదవని పిల్సి, ఆడి సేత యిప్పించే బదులు - ఓ పేచ్చకున్ని తెచ్చి ఆడిసేతి మీదుగా అందించండి మీ అందసందాల 'యిందా'లు. '

'అదుర్సు పులిరాజా! అదుర్సు. అలాగే సెట్టింగు చేసేస్తాం. ధాంకులు - ధాంకులు'

'గాండ్రు - గాండ్రు - యింకెల్లండి' అని సలహాల పులి 'యిందా' కమిటీ సభ్యుల మెడలకి తన సలహా తగిలించి తోలేశాడు.

'యిందా' కమిటీ సభ్యులు వూపిరి తీసుకుని మాట్లాడుకున్నారు.

'ఇప్పుడు 'యిందా' ఎవార్డ్స్ మనం డిసైడై పోయినవి అందించడానికి వొక ప్రేక్షకుడిని పట్టాలి'

'ప్రేక్షకుడు గుడ్డివాడైతే బెటరు.'

'బలేవారే. మన ప్రేక్షకులంతా గుడ్డి ప్రేక్షకులే. లేకపోతే మన సినిమాలెందుకాడిస్తారు!.'

'అయితే ఎవడో ఒకడిని తీసుకొద్దాం - సినిమాలు చూసే అలవాటున్న ప్రేక్షకుడిని నిజంగా చూపులేని గుడ్డివాడినే తీసుకొద్దాం. వాడైతే ఫంక్షన్ త్వరగా జరుగుతుంది. వాట్సప్పులు, ఫేస్‌బుక్స్‌తో బిజీ అయి టైము వృధాచెయ్యడు.'

'యిందా' వారు ఎవార్డ్స్ ఎవరెవరికివ్వాలో నిర్ధారించారు.

ఫంక్షన్ రోజు స్టేజ్ మీదికి యింద్రజిత్ అనే ప్రేక్షకుడిని చెయ్యి పట్టుకుని జాగర్తగా తీసుకొచ్చి కూర్చోబెట్టారు.

ఇంద్రజిత్‌ని చూడగానే అవార్డ్స్ కమిటీ మెంబరొకాయన కంగారుపడ్డాడు.

'ఏవిటా కంగారు?' - అడిగాడు మరో మెంబరు.

'వీడెక్కడ దొరికాడండి బాబూ మీకు?'

'ఏం?'

'ఏం ఏవిటి? ఈ యింద్రజిత్‌గాడు దేవాంతకుడు. అంధుడైనా అఖండుడు. 'యిందా' ఎవార్డు జ్ఞాపికను తాకగానే అది యెవరికొచ్చిందో చెప్పేయగలడు.'

'మీకెలా తెల్సు?'

'నాకు తెలుసు - రవీంద్రభారతిలో వీడి షో వొకటి చూశాను.'

'సరే - చూద్దాం. ఏవైనా - మీరు చెప్పింది నమ్మశక్యంగా లేదు'

అదీ సంగతి విక్రమార్కా! ఇప్పుడు చెప్పు. అంధుడైన ఇంద్రజిత్ అనే ప్రేక్షకుడు - 'యిందా' ఎవార్డ్సను - వొక్కొక్కటీ తాకగానే ఫలానా అవార్డు, ఫలానా కళాకారుడు, కళాకారిణికి వచ్చిందని చెప్పగలిగాడా. అదెలా సాధ్యం? - నాయీ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల ఎవార్డు చిత్రం చూడకపోయినా పగిలిపోయి నువ్వు కూడా 'దా! దా!' కార్పొరేట్ హాస్పిటల్లో చేరాల్సి ఉంటుంది" అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు, 'ఓ ! బేతాళా! ప్రేక్షకుడికి కళ్ళులేవు, అంచేత దృష్టి ఆనదు, అతడు అంధుడు అనుకుని సినిమాలు తీసినంత మాత్రాన అవి ఆడాల్సిన గ్యారంటీ లేదు. ప్రేక్షకుడెరుగని వుత్తమ చిత్రం, వుత్తమ కళాకారులు వుద్భవించలేదు.

స్టేజ్ మీద 'ఇందా' వారి తొలి అవార్డు జ్ఞాపికను తాకగానే, యింద్రజిత్తు 'ఈ ఏడాది వుత్తమ చిత్రం 'తా!' అని ప్రకటించాడు. కమిటీ మెంబర్లు వీడికెల్లా తెలిసింది 'హా!' అని ఆశ్చర్యపడిపోయి లేచారు.. మళ్లీ యింద్రజిత్తు 'ఈ ఏడాది వుత్తమ దర్శకుడు 'ఫటాఫట్ సింగ్' అనగానే మళ్లీ 'ఇందా' కమిటీ 'ఓర్నీ' అనుకున్నారు. తరువాత ప్రేక్షకజిత్ జ్ఞాపికను తాకి 'వుత్తమనటుడు 'బీభత్సబాబు' అనగానే 'మనం డిసైడ్ చేసిన పేర్లన్నీ వీడికెల్లా తెలిసాయి' అనుకుని అవాక్కయ్యారు. తర్వాత 'ఇందా' జ్ఞాపికను తాకి, చుంబించి 'ఈ వుత్తమ నటి ఎవార్డు నీకొచ్చిందని ముందే తెలిసి ఎవార్డుని ముద్దెట్టుకుని తర్వాత నేచేతికిచ్చావా సులోచనా! నీ లిప్‌స్టిక్ సంగతి నా పెదాలకు తెలియదనుకున్నావా? అప్పుడు నువ్వు నా సెకండ్ సెటప్పువి, యిప్పుడు ఫస్టు నటప్పువి. రా. తీసుకో' అని వుత్తమ నటి అవార్డు సులోచనకి యిచ్చాడు 'ఇందా!' అంటూ యింద్రజిత్తు. 'నువ్వు అంధ యింద్రజిత్తువి కాదురా! మమ్మల్నే గుడ్డివాళ్లను చేసిన గుండెలు తీసిన యింద్రజిత్తులమారి ప్రేక్షకుడివి' అని సామూహికంగా గొణుక్కుంటూ కాళ్లు తడిపేసుకున్నారు 'ఇందా' ఎవార్డ్సు కమిటీ మెంబర్లు.

యదాదిత్యగతం తేజో

జగద్భాసయతే అఖిలం|

యచ్చంద్రమసియచ్చాగ్నౌ

తత్తేజోవిద్ధి మామకమ్||

సమస్త సినీ జగత్తును ప్రకాశింపజేయుచున్న సూర్యుని యందలి తేజస్సును, చంద్రుని యందలి తేజస్సును, అగ్నియందలి తేజస్సును సినీపరిశ్రమ వారు నన్నారాధించగా వారికి ప్రేక్షకుడనైన నా చేనియ్యబడినదని తెలిసికొనుము - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు''

- అని బదులు చెప్పగానే, రాజుకి మౌన భంగం కలిగి , బేతాళుడు యెగిరిపోయిన యెవార్డులా యెగిరి మళ్లీ చెట్టెక్కేసాడు.

*(వచ్చేనెలలో మరోకథ)*

Post your comments